ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 9 మే 2025

ఎండైనా.. వానైనా
గంగమ్మ దర్శనమే

బండ వేషంలో భక్తజనం
నేడు తోటివేషం



తిరుపతి గంగ జాతరకు వర్షం పడటం సంప్రదాయం. జాతర మొదలైన మూడో రోజైన గురువారం వాన పడింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా, ఆ తర్వాత చిరుజల్లులుగా మొదలై ఓ మోస్తరు వర్షం కురిసినా భక్తులు వెనకడుగు వేయలేదు. శరీరమంతా రక్తం చిందినట్టు కుంకుమ రాసుకుని, కాటుక బొట్లు, తెల్లటి పూలు చుట్టుకుని వయోపరిమితి లేకుండా బండ వేషంలో గంగమ్మను దర్శించుకున్నారు. మిగతా భక్తులూ అమ్మవారి దర్శనానికి తరలి వచ్చారు. కొందరు చిత్ర, విచిత్ర వేషాలతో భయానకంగా కనిపించారు. ముందుగా వేశాలమ్మను.. ఆతర్వాత తాళ్లపాక పెదగంగమ్మ, తాతయ్యగుంట గంగమ్మ, అంకాళమ్మ అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. కాగా, వేశాలమ్మ బండవేషంలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం భక్తులు తోటి వేషధారణతో గంగమ్మను దర్శించుకుంటారు. ఎక్కువగా పిల్లలు ఈ వేషం వేస్తారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి







జాతర వేషాల్లో చిన్నారులు

చిత్తూరు డీసీసీబీపై సభాసంఘం

- కొణతాల నేతృత్వంలో అసెంబ్లీ కమిటీ ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో జరిగిన అవినీతి అక్రమాలపై చర్యలకు అడుగు పడింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో చోటు చేసుకున్న అవినీతి, నిధుల దుర్వినియోగం, అక్రమాలపై శాసన సభాసంఘం విచారణ చేపట్టనుంది. ఇందుకు సంబంధించి మాజీ మంత్రి, ప్రస్తుత అనకాపల్లె ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నేతృత్వంలో శాసనసభా కమిటీని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నియమించారు. చిత్తూరు డీసీసీబీతో పాటు రాష్ట్రంలోని అన్ని డీసీసీబీల వ్యవహారాలపై ఈ కమిటీ విచారించనుంది. ఈ కమిటీలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సభ్యుడిగా నియమించారు. చిత్తూరు డీసీసీబీలో జరిగిన అవినీతి అక్రమాలపై సహకార చట్టం సెక్షన్ 51 కింద డీఆర్వో మోహన్ కుమార్ విచారణ పూర్తి చేశారు. ఈ నెల 15 తరువాత కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు నివేదికను అందించనున్నారు. దాన్ని కలెక్టర్ పరిశీలించిన అనంతరం ప్రభుత్వానికి పంపనున్నారు.

సత్యవేడులో ప్రజా దర్బార్

- మంత్రి లోకేశ్‌కు వినతుల వెల్లువ
- ముగిసిన రెండు రోజుల పర్యటన



ప్రజా దర్బార్‌కు వచ్చిన వికలాంగుడు వరుణ్‌ను పలకరిస్తున్న లోకేశ్

సత్యవేడు, మే 8 (ఆంధ్రజ్యోతి): సత్యవేడులో గురువారం ఉదయం మంత్రి లోకేశ్ 62వ ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధ పడుతున్న ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీదారులతో సెల్ఫీలు దిగారు. మంత్రికి వినతులు వెల్లువెత్తాయి. ప్రధానంగా బుచ్చినాయుడుకండిగ మండలం తలారివెట్టులో తాను 2021లో కొనుగోలు చేసిన 2.21 ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని రైతు హరిప్రసాద్ నాయుడు కోరారు. పూర్తి అంగవైకల్యంతో బాధ పడుతున్న తన 20 ఏళ్ల కుమారుడికి ఆధార్ బయోమెట్రిక్ సమస్యవల్ల ఇప్పటి వరకు పింఛను మంజూరు కాలేదని సత్యవేడు మండలం మల్లవారిపాళెం ఈస్ట్ పంచాయతీకి చెందిన వెంకటేశులు ఆవేదన వ్యక్తంచేశారు. తన కుమారుడికి పింఛను ఇప్పించి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం తమ కుటుంబానికి మంజూరు చేసిన ఐదు సెంట్ల ఇంటి స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి నుంచి స్థలాన్ని రక్షించి, ఇంటి నిర్మాణానికి అనుమతివ్వాలని సత్యవేడు మండలం మదనంబేడుకు చెందిన సీహెచ్ శాంతి విన్నవించారు. తమ గ్రామంలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని నారాయణవనం మండలం ఎరికంబట్టుకు చెందిన దామోదరంరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగం ఇప్పిస్తామని సత్యవేడుకు చెందిన గోపాలకృష్ణ, ధనశేఖర్ తన వద్ద రూ.3 లక్షలు తీసుకుని మోసం చేశారని, న్యాయం చేయాలని టీపీకోటకు చెందిన వెంకటేశులు మంత్రిని కోరారు. సత్యవేడు పంచాయతీలో తాగునీటి కొరత తీర్చాలని, 50 పడకల ఆస్పత్రిని 100 పడకల స్థాయికి పెంచాలని, మట్టి మాఫియాను నియంత్రించాలని మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబు కోరారు. పట్టణంలో 20 ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న షాదీమహల్‌ను పూర్తి చేయాలని మసీదు కమిటీ సభ్యులు వినతి పత్రం అందించారు. తన అనుభవంలోని స్థలాన్ని వైసీపీ నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించి దారికి అడ్డంగా అక్రమ కట్టడం కట్టడంపై చర్యలు తీసుకోవాలని పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడుకు చెందిన జయంతి కోరారు.



చిన్నారితో సరదాగా..

శ్రేణుల్లో నూతనోత్సాహం

సత్యవేడులో బుధవారం సాయంత్రం కార్యకర్తల సమన్వయ సమావేశంలో పాల్గొన్న మంత్రి లోకేశ్.. గురువారం ఉదయం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం శ్రీసిటీకి వెళ్లి ఎల్‌జీ పరిశ్రమ భూమిపూజలో పాల్గొనడంతో ఆయన రెండు రోజుల పర్యటన ముగిసింది. ఆయన పర్యటన సత్యవేడు నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపింది. కొన్నేళ్లుగా సందిగ్ధావస్థలో ఉన్న కేడర్‌కు ఆయన ఇచ్చిన భరోసా ఉత్సాహం నింపిందనే చెప్పాలి. 'ఇక్కడి సమస్యలన్నీ తెలుసు. పరిష్కరిస్తాం. ఇద్దరు అబ్జర్వర్లను నియమించాం. సమస్యలుంటే వారితో చర్చించి, పరిష్కరించుకోండి. అవసరమైతే జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉన్నారు. అలకలు వీడి ఏకతాటిపై నిలబడండి. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కాలకేయులు (ప్రతిపక్షం) కాచుకుని ఉన్నారు. మళ్లీ రాష్ట్రం చీకట్లోకి వెళ్ళాల్సి వస్తోంది జాగ్రత్త' అంటూ లోకేశ్ ఇచ్చిన పిలుపునకు కార్యకర్తల నుంచి విపరీత స్పందన వచ్చింది.

లోకేశ్ ప్రజా దర్బార్‌కు వైసీపీ నేతలు

రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ప్రజా దర్బార్‌కు సత్యవేడు మండల వైసీపీ నేతలు హాజరయ్యారు. ఆ పార్టీకి చెందిన ఎంపీపీ ప్రతిమ భర్త, వైసీపీ కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి, వైసీపీ మాజీ కన్వీనర్ నిరంజన్‌రెడ్డి, సత్యవేడు సర్పంచ్ మంజుల భర్త రమేష్ తదితరులు పాల్గొన్నారు. మండలంలో పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీకి కేటాయించడానికి జరుపుతున్న భూసేకరణను నిలిపివేయాలని లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. పారిశ్రామిక అభివృద్ధి ముఖ్యం కదా.. పరిశ్రమలు వస్తే మీ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది కదా అని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. అయినా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. వారు లోకేశ్‌తో సెల్ఫీ దిగారు.





విద్యార్థులకు మంత్రి అభినందనలు

అద్భుత ప్రతిభతో లండన్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సంపాదించిన నలుగురు విద్యార్థులను మంత్రి లోకేశ్ అభినందించారు. చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం మంగళపల్లె జడ్పీ హైస్కూల్‌కు చెందిన హేమ, పునీత్ సాయి, లహరి, రేవతి గణిత శాస్త్రంలోని 'పై' విలువను ఒక్కొక్కరు 1000 డెసిమిల్స్‌ను చూడకుండా చెప్పి లండన్ బుక్‌ఆఫ్ రికార్డ్‌లోకి ఎక్కారు. వీరిని తీసుకుని ఉపాధ్యాయులు ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్‌ను కలిశారు. విద్యార్థుల ప్రతిభను మెచ్చుకున్న మంత్రి.. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఫాసిజంపై పోరాడింది ఎర్రజెండానే
సీపీఎం రాష్ట్ర సభల ప్రారంభోత్సవంలో నేతలు

ముగిసిన పద్మావతి పరిణయోత్సవం
గరుడ వాహనంపై మలయప్ప అభయం

టీటీడీలో యూడీపీ సెల్
ప్రతిపాదనలకు మంత్రివర్గ ఆమోదం

వివరాలు 6వ పేజీలో



సాగరంలోకి వెళుతున్న అధికారుల బృందం

ప్రకృతి విపత్తులపై అప్రమత్తం


● మత్స్యకారుల అవగాహనకు మాక్‌డ్రిల్



బెటాలియన్ సిబ్బందితో సబ్‌కలెక్టర్, అధికారులు

కోట, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుల సన్నద్ధతకు కోట మండలం గోవిందపల్లిపాళెం సముద్రతీరంలోవెంకటగిరి బెటాలియన్ ఆధ్వర్యంలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎస్పీ గీతా కుమారి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, తహశీల్దార్ జయజయరావుల సారథ్యంలో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సముద్రంలో పడిపోతే తక్షణం తీసుకోవాల్సిన జాగ్రత్తలను మాక్‌డ్రిల్‌లో ప్రదర్శించారు. సునామి వంటి విపత్తులను ఎలా ఎదుర్కొనాలో మత్స్యకారులకు పూసగుచ్చినట్టు వివరించారు. చిల్లకూరు, కోట, వాకాడు మండలాల్లోని 11 తీర గ్రామాల మత్స్యకారులు ఈ మాక్ డ్రిల్ తిలకించి మెలకువలను తెలుసుకున్నారు. గోవిందపల్లిపాళెం ముఖద్వారం నుంచి సముద్రంలోకి వెళ్లి సుమారు రెండు గంటల పాటు మాక్‌డ్రిల్‌ను ప్రదర్శించారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాల ప్రయోగాలతో తీరంలో సందడి నెలకొంది.

సర్వదర్శనానికి 9 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 9 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.25 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,001

తలనీలాలు సమర్పించినవారు: 28,637

ఎల్జీతో రెండు వేల మందికి పైగా ఉపాధి

● ఎల్జీ సిటీ నిర్మించాలని కొరియన్ సంస్థకు విజ్ఞప్తి ● శ్రీసిటీకి తిరుపతి ఎయిర్‌పోర్టుతో డైరెక్ట్ కనెక్టివిటీ ● ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్





ఎల్జీ ప్రతినిధులు, అధికారులు, ఎమ్మెల్యేలతో మంత్రి లోకేశ్ - ఎల్జీ సంస్థ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న లోకేశ్

తిరుపతి, మే 8 (ఆంధ్రజ్యోతి): 'శ్రీసిటీలో 5 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఎల్జీ పరిశ్రమ ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. 1500 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఎల్జీ పరిశ్రమ ముఖ్య విక్రేతల ద్వారా రూ.839 కోట్ల అదనపు పెట్టుబడులతో అనుబంధ ప్లాంట్లు కూడా వస్తాయి. వాటి ద్వారా మరో 690 మందికి ఉద్యోగావకాశాలు వస్తాయి' అని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శ్రీసిటీలో గురువారం మధ్యాహ్నం ఎల్జీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసిన సందర్భంగా మాట్లాడారు. అనుబంధ యూనిట్లతో పాటు ఎల్జీ సిటీ నిర్మించాలని ఆ సంస్థ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఏపీ ప్రభుత్వ సహాయ సహకారాల పట్ల నమ్మకంతో శ్రీసిటీలో పరిశ్రమ పెట్టేందుకు దక్షిణ కొరియాకు చెందిన ఎల్జీ సంస్థ ముందుకు రావడం హర్షణీయమన్నారు. ఈ పరిశ్రమ ఎల్జీ సప్లై చెయిన్‌ను మరింత బలోపేతం చేస్తుందని, దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించే హైటెక్ యూనిట్‌గా అవతరిస్తుందన్నారు. ఎల్జీ సంస్థ, దాని భాగస్వామ్య సంస్థలు కలసి ఇక్కడ ఏఐ ఆధారిత తయారీ, స్మార్ట్ ఉత్పత్తి ప్రక్రియలు, ఎనర్జీ ఎఫిషియంట్ విధానాలు, అత్యాధునిక సాంకేతికతలను తీసుకొస్తున్నాయని లోకేశ్ చెప్పారు. ఇలాంటి ప్రాజెక్టులతో తమ ప్రభుత్వం స్మార్ట్ ఉద్యోగాలను సృష్టిస్తోందని, తద్వారా రాష్ట్ర భవిష్యత్తును నిర్మిస్తోందన్నారు. యువత తమ ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చడం కోసం పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఏపీలో పారిశ్రామిక ప్రగతికి శ్రీసిటీ చుక్కానిలా మారుతోందన్నారు. రాబోయే నాలుగేళ్లలో శ్రీసిటీ నుంచి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి డైరెక్ట్ కనెక్టివిటీ కల్పిస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా సంస్థ ఎండీ హాంగ్ జు జియోన్, హోమ్ సొల్యూషన్స్ సీఈవో జేబియోల్ లియు, ఎకో సొల్యూషన్స్ సీఈవో జే సంగ్‌లీ, సీడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ జి.శ్రీనివాసులు, సత్యవేడు, శ్రీకాళహస్తి, నగరి, చంద్రగిరి, జీడీనెల్లూరు ఎమ్మెల్యేలు కోనేటి ఆదిమూలం, బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భానుప్రకాష్, పులివర్తి నానీ, థామస్, రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి కాటమనేని భాస్కర్, ఏపీఐఐసీ వైస్ ఛైర్మన్ అభిషిక్త కిషోర్, కాన్సులేట్ జనరల్ (ఏపీ, తెలంగాణ) చుక్కపల్లి సురేష్, కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, ప్రతినిధులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

తిరుమలలో చైనీస్ ఫుడ్ అమ్మొద్దు

● సంప్రదాయ వంటకాలే ఉండాలి

● అదనపు ఈవో వెంకయ్య చౌదరి సూచనను అంగీకరించిన హోటళ్ల యజమానులు

తిరుమల, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి హానికరమైన చైనీస్ ఫుడ్‌ను విడిచిపెట్టి, సంప్రదాయ వంటకాలనే తిరుమలలో విక్రయించాలని హోటళ్ల నిర్వాహకులకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సూచించారు. గురువారం ఆయన హోటళ్ల యజమానులు, నిర్వాహకులతో సమావేశమయ్యారు. భక్తులకు అసౌకర్యం లేకుండా హోటళ్లలో పరిశుభ్రత పాటించాలని, నాణ్యమైన ఆహార పదార్థాలను భక్తిశ్రద్ధలతో అందించాలని చెప్పారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంప్రదాయ వస్త్రధారణతో సిబ్బంది ఉండాలని సూచించారు. త్వరలో ఐదు నుంచి 10 హోటళ్లలో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఈ విధివిధానాలు అమలయ్యేలా నిర్వాహకులు సహకరించాలన్నారు. అనంతరం వెంకయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ.. చైనీస్ ఫుడ్‌ను పూర్తిగా నిలిపివేసేందుకు హోటళ్ల నిర్వాహకులు స్వచ్ఛందంగా అంగీకరించారని, అందుకు కొంత సమయం అడిగారన్నారు.

సరిహద్దుల్లో పెరిగిన నిఘా



తిరుపతిలో గురువారం రాత్రి తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మే 8(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో సరిహద్దుల వెంబడి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు తిరుమల క్షేత్రంలో అణువణువునా తనిఖీలు చేస్తున్నారు. ఆక్టోపస్, పారా మిలటరీ, ఏపీఎస్పీ, రిజర్వు, విజిలెన్సు సిబ్బందిని అప్రమత్తం చేశారు. సముద్ర తీర ప్రాంతంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. విమానాశ్రయంలో బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేస్తున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు, అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గత 10 రోజుల వ్యవధిలో దాదాపు 50 మందిని విచారించారు. ప్రధానంగా ఇతర రాష్ట్రాల నుంచి తిరుమల కొండకు వస్తున్న వాహనాలపై నిఘా పెంచారు. బస్టాండు, రైల్వే స్టేషన్లలో అప్రమత్తంగా ఉంటున్నారు. సీసీ కెమెరాల ద్వారా నిత్యం పర్యవేక్షణ జరుగుతున్నట్లు ఓ పోలీసు అధికారి చెప్పారు. డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఇక, ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాలతో గురువారం రాత్రి 10 నుంచి 11 గంటల వరకు తిరుపతిలోని డార్మెటరీలు, లాడ్జీల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా అనుమానితులుంటే ఈస్ట్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

టీటీడీలో యూడీపీ సెల్

● ఐటీ విభాగం డీజీఎం పోస్టు జీఎం స్థాయికి పెంపు

● ప్రతిపాదనలకు మంత్రివర్గ ఆమోదం

తిరుపతి, మే 8 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశం టీటీడీకి సంబంధించిన రెండు ప్రతిపాదనలను ఆమోదించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఇ-క్యాబినెట్‌లో టీటీడీ ప్రతిపాదనలు చర్చకు వచ్చాయి. అందులో టీటీడీలో అర్బన్ డిజైన్ అండ్ ప్లానింగ్ (యూడీపీ) సెల్ ఏర్పాటుకు దేవదాయ శాఖ చేసిన ప్రతిపాదన ఒకటి. తిరుపతి, తిరుమల సహా టీటీడీ అనుబంధ ఆలయాలు కలిగిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ విభాగం అవసరమని దేవదాయ శాఖ ప్రతిపాదనలో పేర్కొంది. దీనిపై చర్చించిన మంత్రివర్గం యూడీపీ సెల్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. దీనికి అవసరమైన ఎనిమిది పోస్టుల మంజూరుకూ అనుమతిచ్చింది. ఇక, టీటీడీ పాలన, వివిధ కార్యక్రమాల అమల్లో కీలకంగా మారిన ఐటీ విభాగంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టును జనరల్ మేనేజర్‌గా అప్‌గ్రేడ్ చేయాలన్న ప్రతిపాదననూ మంత్రివర్గం ఆమోదించింది. ఆ పోస్టు వేతన స్కేలును టీటీడీలో సూపరింటెండెంట్ ఇంజనీర్ వేతన స్కేలుతో (రూ. 1.01 లక్షల నుంచి 1.74 లక్షలు) సమానంగా ఖరారు చేయడానికీ ఆమోదం తెలిపింది.

పల్టీలు కొట్టిన కారు



● ప్రయాణికులు సురక్షితం

ఎర్రావారిపాలెం, మే 8(ఆంధ్రజ్యోతి): కారు నాలుగు పల్టీలు కొట్టింది. అందులోని ఆరుగురూ ప్రాణాలతో బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లెకు చెందిన ప్రవీణ్ కోయంబత్తూరులో పాదరక్షల కంపెనీలో పనిచేస్తున్నారు. గురువారం తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి తలకోన సిద్ధేశ్వర స్వామిని దర్శించుకుని సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. ఎర్రావారిపాలెం మబ్బుతోపు వద్ద అతివేగంతో వస్తున్న కారు అదుపు తప్పి నాలుగు పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో రెండు నెలల పసిబిడ్డతోపాటు అందరూ చిన్నపాటి గాయాలతో బయట పడ్డారు. ఏఎస్ఐ కోదండరాం అక్కడకు చేరుకుని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. అందరూ సురక్షితంగా బయటపడటంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

తిరుపతి(నేరవిభాగం), మే 8(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ప్రత్యేక న్యాయస్థానం గురువారం తీర్పునిచ్చింది. లైజన్ అధికారి పి.శ్రీనివాసులు కథనం మేరకు.. 2019లో అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన బుక్కే అమరేష్ నాయక్, మోతీనగర్‌కు చెందిన చెన్నూరు నిరంజన్ పీలేరు పోలీసు స్టేషన్ పరిధిలోని పచ్చారమాకుల పల్లి వద్ద ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. విచారణానంతరం ఎస్ఐ కృష్ణయ్య వీరిపై కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఆరేళ్లుగా కేసు కొనసాగింది. తిరుపతిలో కొత్తగా రాష్ట్ర ఎర్రచందనం కోర్టు ఏర్పాటైన క్రమంలో ఈ కేసును న్యాయమూర్తి నరసింహమూర్తి విచారించారు. ఇరువర్గాల వాదనలు విన్నాక, ఇద్దరు నిందితులకు గురువారం ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే రూ.6 లక్షల వంతుల జరిమానా విధించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణమనాయుడు, కోర్టు అనుసంధాన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, దర్యాప్తు అధికారులను అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అభినందించారు.



ముద్దాయిలతో పోలీసులు

ఫాసిజంపై పోరాడింది ఎర్రజెండానే

● సీపీఎం రాష్ట్ర సభల ప్రారంభోత్సవంలో నేతలు



సభా వేదికపై సీపీఎం నేతల సంఘీభావం



సీపీఎం శ్రేణుల ర్యాలీ

తిరుపతి, మే8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే ఫాసిజంపై పోరాడింది ఎర్రజెండానేనని సీపీఎం నేతలు ఉద్ఘాటించారు. తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రం వేదికగా గురువారం నుంచి మూడు రోజుల పాటు సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 'ఫాసిజంపై ప్రజాసైన్యం విజయ స్ఫూర్తి' పేరిట కచ్చపి ఆడిటోరియంలో గురువారం సాయంత్రం సభ జరిగింది. సీపీఎం జాతీయ కార్యదర్శి ఎంఏ బేబి, పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఫాసిజంపై ప్రజాసైన్యం విజయ స్ఫూర్తికి చిహ్నంగా తొలుత నేతలు అభివాదం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న అభివృద్ధి మంత్రంపై శ్వేతపత్రం విడుదల చేయాలని శ్రీనివాసరావు డిమాండు చేశారు. కౌలు రైతులకు నష్ట పరిహారం లేదని, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఏనుగుల దాడి నుంచి రక్షణ లేదని, ప్రజారక్షకుడని చెప్పుకుంటున్న పవన్‌కల్యాణ్‌కు ఇవి పట్టవా అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో సీపీఎం ఒకటే రాజకీయ ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ ఉగ్రదాడిలో బాధితులు తమను కాపాడిన ముస్లింలను కొనియాడితే వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా దూషించడం సరైనది కాదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ తిరుపతిలో కూడా హిందువులను కానివారిని ఇబ్బందులు పెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, అంగేరి పుల్లయ్య, జనార్దన్, టి.సుబ్రమణ్యం, నాయకులు సాయిలక్ష్మి, జయచంద్ర, ఆర్.లక్ష్మి, వేణుగోపాల్, మాధవ్, హరినాథ్, వెంకటేష్ పాల్గొన్నారు. అంతకుముందు ఆర్టీసీ సెంట్రల్ బస్టాండు సమీపంలోని ఎంఎస్ సుబ్బలక్ష్మి విగ్రహం నుంచి కార్యకర్తలతో స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు.





ముగిసిన పద్మావతి పరిణయోత్సవం

● గరుడ వాహనంపై మలయప్ప అభయం

తిరుమల, మే8(ఆంధ్రజ్యోతి): పద్మావతి శ్రీనివాసుల పరిణయ మహోత్సవం గురువారం తిరుమలలో ముగిసింది. సాయంత్రం స్వామివారు గరుడ వాహనంపై, దేవేరులు వేర్వేరు పలకిలపై ఊరేగింపుగా నారాయణగిరి ఉద్యానవనంలోని పద్మావతీ పరిణయోత్సవ మండపానికి చేరుకున్నారు. రెండు రోజుల్లాగే ఎదుర్కోలు, పూల చెండ్లాట, వస్త్ర సమర్పణ తదితర కార్యక్రమాలు ముగిశాక కొలువు నిర్వహించారు. వేద పారాయణం చేశారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు సంకీర్తనలను ఆలపించారు. అనంతరం స్వామి దేవేరులతో కలిసి ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేయడంతో మూడురోజుల వేడుకలు వైభవంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, డిప్యూటీఈవో లోకనాథం, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



డీపీటీవోగా వెంకటరావు బాధ్యతల స్వీకరణ



తిరుపతి(ఆర్టీసీ), మే 8(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజారవాణాధికారిగా కె.వెంకటరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన అక్కడి బస్టాండును, డిపోను సందర్శించారు. సాయంత్రం జిల్లా కార్యాలయానికి చేరుకోగా అధికారులు విశ్వనాథం, బాలాజీ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఈయూ, వైసీపీ యూనియన్ నాయకులు ఆయన్ను కలిసి సన్మానించారు.

సాంకేతిక కారణాలతో ఆగిన స్పైస్ జెట్



గురువారం ఉదయం స్పైస్ జెట్ కౌంటర్ ముందు సిబ్బందిని నిలదీస్తున్న ప్రయాణికులు

● ప్రయాణికుల నిరసన

● రీఫండ్ చేస్తామనడంతో మరో విమానంలో ప్రయాణం

రేణిగుంట, మే 8, (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో బుధవారం రాత్రి సాంకేతిక కారణాలతో స్పైస్ జెట్ విమానం ఆగిపోయింది.హైదరాబాదు నుంచి రాత్రి 8గంటలకు తిరుపతికి చేరుకుని 8.35కు హైదరాబాదుకు బయలుదేరాలి. తిరుపతికి చేరుకున్న ఈ విమానంలో హైదరాబాదు వెళ్లడానికి 70 మంది ప్రయాణికులు వేచి ఉన్నారు. స్పైస్ జెట్ విమానంలో సాంకేతిక సమస్యను గుర్తించిన పైలెట్ యాజమాన్యానికి సమాచారం ఇచ్చార.ఉ సాంకేతిక సమస్య వల్ల విమానం మరమ్మతులు చేయాల్సి ఉందని సిబ్బంది ఆలస్యంగా చెప్పడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విమానాశ్రయంలో నిరసన తెలియజేశారు.అక్కడున్న అధికారులు వీరికి సర్ది చెప్పి టాక్సీలు కేటాయించి బస ఏర్పాటు చేశారు. తిరిగి గురువారం ఉదయం వీరంతా విమానాశ్రయం చేరుకోగా.. అప్పటికీ స్పైస్ జెట్‌కు మరమ్మతులు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో యాజమాన్యం టికెట్ల డబ్బును రీఫండ్ చేస్తామని చెప్పడంతో 10.30 గంటలకు ఇండిగో విమానంలో ప్రయాణికులు హైదరాబాదుకు వెళ్లారు.

పోలీసుల అదుపులో గాజుల చోరీ ముఠా

తిరుమల, మే8(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఓ వృద్ధురాలి చేతి గాజులను దోచుకుపోయిన ముఠాలో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాపట్ల జిల్లాలోని తుమ్మినేనికి చెందిన రవికుమార్ తన 70 ఏళ్ల తల్లి లక్ష్మి, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకుని బుధవారం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో రాంభగీచ బస్టాండ్ వద్ద బస్సు ఎక్కుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు లక్ష్మిని బస్సు మెట్లపై నెట్టి చేతికి ఉన్న 50 గ్రాముల బంగారు గాజులను లాక్కుని పారిపోయారు. రవికుమార్ ఫిర్యాదుతో పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించారు. పోలీసులు కొందరిని గుర్తించారు. తిరుమలలో వారి ఉనికి కోసం రివర్స్ మోడ్‌లో సీసీ కెమెరాల ఫుటేజీను పరిశీలించారు. ఉత్తరప్రదేశ్ నుంచి ఏడుగురు తిరుమల వచ్చి యాత్రికుల వసతి సముదాయంలో బస చేసినట్టు గుర్తించారు. అక్కడ వారిచ్చిన సెల్‌ఫోన్ నంబరు ఆధారంగా బృందంలోని నలుగురిని శ్రీకాళహస్తిలో బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన ముగ్గురు పరారయ్యారు. వీరి వద్ద బంగారు గాజులు ఉన్నట్టు పోలీసుల విచారణలో తేలింది. వారికోసం పోలీసులు గాలిస్తున్నారు. వీరు పాత నేరస్థులని తెలిసింది.

విచారణకు హాజరుకాలేదని ఏడాది జైలుశిక్ష

తిరుమల, మే8(ఆంధ్రజ్యోతి): 17 ఏళ్ల నాటి నకిలీ సర్టిఫికేట్ల కేసులో తిరుపతికి చెందిన ఓ వ్యక్తికి ఏడాది పాటు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. తిరుమల టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. 2008లో టీటీడీ బార్బర్ నోటిఫికేషన్‌కు సంబంధించి 10, 7 తరగతుల నకిలీ సర్టిఫికేట్లతో కొందరు ఉద్యోగం పొందారని టీటీడీ అధికారులు తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి మారుతినగర్‌కు చెందిన శివరామయ్య ఈ నిందితుల్లో ఒకడు. అయితే ఇతను విచారణ తర్వాత కోర్టుకు హాజరుకాకపోవడంతో కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఈక్రమంలో తిరుమల వన్‌టౌన్ పోలీసులు ఈనెల 5న శివరామయ్యను అరెస్ట్ చేసి తిరుపతి స్పెషల్ జడ్జి ముందు హాజరుపరిచారు. దీంతో ముద్దాయికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. జరిమానా కట్టకుంటే ఏడాదిన్నరపాటు జైలుశిక్ష ఉంటుందని తీర్పునిచ్చారు.

● గతేడాది నవంబరులోని వైకుంఠం క్యూకాంప్లెక్స్-2 వద్ద తెలంగాణకు చెందిన ఓ భక్తుడి నుంచి రూ.2,500 దొంగిలించిన కేసులో తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన శ్రీనివాస్‌కు తిరుపతి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.వంద జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

'మయూర' జయరాం చౌదరిపై అరెస్టు వారెంటు రీకాల్

తిరుపతి(నేరవిభాగం), మే 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని మయూర గ్రూప్ ఆఫ్ సంస్థల అధినేత మయూర జయరాం చౌదరిపై కోల్‌కత్తా హైకోర్టు జారీ చేసిన అరెస్టు వారెంటు రీకాల్ చేస్తూ తీర్పు చెప్పినట్లు తిరుపతి ఈస్ట్ పోలీసులు చెప్పారు. గతంలో కోల్‌కత్తాలోని ఓ కంపెనీకి అవసరమైన చక్కెర సరఫరా చేస్తామని చెప్పి ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనికి సంబంధించి అడ్వాన్సుగా జయరాం చౌదరికి రూ.8 కోట్లు చెక్కు అందచేశారు. కొన్ని కారణాలతో చక్కెర సరఫరా చేయకపోవడంతో డబ్బు వెనక్కి ఇవ్వాలని వారు కోరారు. ఈ క్రమంలో రూ.5 కోట్లు ఇవ్వగా.. మిగిలిన మొత్తం కోసం వారు కోల్‌కత్తా హైకోర్టులో కేసు దాఖలు చేశారు. ఈ వాయిదాలకు హాజరు కాక పోవడంతో పాటు పిటీషనర్‌కు సరైన సమాధానం చెప్పక పోవడంతో ఇటీవల న్యాయస్థానం జయరాం చౌదరికి అరెస్టు వారెంటు జారీ చేసిన విషయం విదితమే. దీనిపై వారం కిందట జూమ్ కాన్ఫరెన్సు ద్వారా కోల్‌కత్తా హైకోర్టు జయరాం చౌదరిని, జిల్లా పోలీసు అధికారులను విచారించింది. ఆయనకు అనారోగ్య కారణాల రీత్యా చేసిన తప్పును ఒప్పుకొని కోర్టును క్షమాపణ కోరడంతో.. అరెస్టు చేయాలన్న ఆదేశాలను న్యాయస్థానం ఉపసంహరించుకున్నట్లు ఈస్ట్ పోలీసులు చెప్పారు.

బండ వేషంలో గంగమ్మ భక్తులు

సందడి చేసిన చిన్నారులు - పెరిగిన భక్తుల రద్దీ

తిరుపతి(జీవకోన), మే 8(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా గురువారం బండ వేషధారణతో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శరీరమంతా కుంకుమ రాసుకుని, కాటుక బొట్లు పెట్టుకుని, తెల్లటి పూలు చుట్టుకుని చిన్నపెద్ద తేడా లేకుండా వేషాలు ధరించారు. బొరుగుల హారాలు చుట్టుకుని ఆలయానికి చేరుకుని భక్తి శ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. బండ వేషధారణలో చిన్నారులు ఆలయ ప్రాంగణంలో సందడి చేశారు. శరీరమంతా కుంకుమ రాసుకుని, చేతిలో చీపురు పుల్లలు, వేపాకు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అమ్మవారిని కొలుస్తూ ప్రదక్షిణలు చేశారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్ మునికృష్ణ, మహేష్‌యాదవ్, బాబ్జీ, నంద, సుధ, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి సారె సమర్పించిన భూమన

టీటీడీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అమ్మవారికి సారె సమర్పించారు. గంగమ్మను దర్శించుకున్నారు. ఆయన వెంట టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ తదితరులున్నారు.



45ఏళ్లుగా అమ్మవారిని దర్శించుకుంటున్నా..



45ఏళ్లుగా అమ్మవారిని దర్శించుకుంటున్నా. జాతరలో భాగంగా ఒక రోజు అర్ధరాత్రి కుటుంబ సమేతంగా గండ దీపంతో వచ్చి మొక్కు చెల్లిస్తున్నాం. గతంలో ఆలయం ముందు మొక్కలు, రాళ్లు, మట్టి ఉండేవి. వర్షం వచ్చిందంటే షెల్టర్ లేక తడిసి ముద్దయ్యేవాళ్లం. ఇప్పుడు బాగా అభివృద్ధి చేశారు. సౌకర్యాలు బాగున్నాయి.

- వీరమణిశాస్త్రి, కోటకొమ్మలవీధి తిరుపతి

కోర్కెలు తీర్చే కల్పవల్లి



భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా గంగమ్మ తల్లికి పేరుంది. సీమ జిల్లాల్లో అమ్మవారి జాతరకు ఎంతో ప్రాచుర్యం ఉంది. ఏటా కుటుంబ సమేతంగా వచ్చి మొక్కు చెల్లిస్తాం. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు బాగున్నాయి. అమ్మవారికి అంబలి నైవేద్యం చాలా ప్రీతి.

- వనిత, గిరిపురం, తిరుపతి

మా కాలంలో జాతరే వేరు

మా కాలంలో ఆలయం చుట్టుపక్కల ఇళ్లు ఉండేవి కావు. గంగమ్మ జాతర రోజుల్లో రంగులరాట్నాలు, చిరు అంగళ్లతో సందడిగా ఉండేది. కాలక్రమేణా గుడి చుట్టూ ఇళ్లు వచ్చేశాయి. గుడి అభివృద్ధి చెందింది. 1967లో ఆలయ కమిటీ మెంబర్‌గా ఉన్నాను. అప్పటి నుంచి అమ్మవారికి వెయ్యికళ్ల దుత్తతో మొక్కులు చెల్లించుకోవడం అలవాటైపోయింది.

- చెంగల్రాయులు, చింతకాలయ వీధి

అమ్మకు చెప్పకుండా ఊరుదాటం



మా చిన్నతనం నుంచి ఏదైనా పనిమీద ఊరు దాటాలంటే అమ్మవారికి చెప్పే వెళ్తాం. అమ్మ ఆశీస్సులు తీసుకోకుండా ఇప్పటివరకు నగరం దాటి వెళ్లింది లేదు. గంగమ్మతల్లి మా ఇంటి ఇలవేల్పు. 30 ఏళ్లుగా జాతరను చూస్తున్నాం. అప్పటికీ ఇప్పటికీ గుడి ప్రాంగణంలో ఎన్నో మార్పులు వచ్చాయి.

- బాలాజీ, టీకే లేఔట్, తిరుపతి

35 ఏళ్లుగా వస్తున్నాను



మంచి మనసుతో కోరికలు కోరుకుంటే గంగమ్మ తల్లి నిండుమనసుతో దీవిస్తుంది. భక్తుడి కోరికను నెరవేర్చుతుంది. దాదాపు 35 ఏళ్లకు పైగా ఏటా గంగమ్మ జాతర సందర్భంగా ఆలయానికి వస్తున్నాను. వెయ్యికళ్ల దుత్తను తీసుకుని మొక్కులు తీర్చుకుంటున్నాను.

- భాగ్యలక్ష్మి, భవానీనగర్, తిరుపతి

గంగమ్మకు ఈఎస్ సారె సమర్పణ



తిరుపతి(నేరవిభాగం), మే 8(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి గురువారం తాతయ్యగుంట గంగమ్మకు సారె సమర్పించారు. కుటుంబ సభ్యులు, ఎక్సైజ్ అధికారులతో కలిసి తలపై కుండ పెట్టుకుని మేళతాళాల నడుమ గంగమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయంలో పొంగలి పెట్టి భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. ఏఈఎస్ వాసుదేవచౌదరి, సీఐలు రామచంద్ర, నరసనాయుడు, శ్యామ్, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత ఉపాధిపై దృష్టి పెట్టాలి



జాబ్‌మేళాను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): యువత ఉపాధిపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సూచించారు. భవానీనగర్ కూడలిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. 16 ఎంఎన్‌సీ కంపెనీలు 700 ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఎంపికైన యువతకు ఆఫర్ లెటర్స్ అందించారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 20 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, అందులో భాగంగానే తిరుపతిలో ఇప్పటికే 14 మినీ జాబ్‌మేళాలు నిర్వహించి 615మందికి ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. విశాఖ, విజయవాడలకు దీటుగా తిరుపతిని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా అధికారి లోకనాథం, డిప్యూటీ మేయర్ మునికృష్ణ, బీజేపీ నేత సామంచి శ్రీనివాస్, జనసేన నాయకులు రాజారెడ్డి, దేవర మనోహర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన చిత్రలేఖన శిక్షణ తరగతులు



గీసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న పిల్లలు

తిరుపతి అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో పది రోజులుగా నిర్వహిస్తున్న చిత్రలేఖన ఉచిత శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. వేసవి సెలవుల సందర్భంగా 5నుంచి 10వ తరగతి విద్యార్థులు 50మంది హాజరయ్యారు. ప్రముఖ చిత్ర కళాకారిణి బత్తుల అర్చన చిత్ర లేఖనంపై పిల్లలకు శిక్షణ ఇచ్చారు. చిత్రాలు గీయడంలో మెలకువలు నేర్పుతూ వారిలో ఆసక్తి పెంచారు. రుయాస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ భారతి పిల్లలతో సమానంగా శిక్షణ తీసుకున్నారు. ముగింపు సందర్భంగా పిల్లలకు చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించి, ప్రతిభావంతులను అభినందించారు.

పృథ్వి హీరో ద్వితీయ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న డీటీవో మురళీమోహన్

తిరుపతి అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి-రేణిగుంట రోడ్డులో ఏర్పాటు చేసిన పృథ్వి హీరో ద్వితీయ షోరూంను జిల్లా రవాణాధికారి మురళీమోహన్ గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు రోడ్డు నిబంధనల చట్టాన్ని పాటించాలని, సురక్షిత ప్రయాణం సాగించాలని కోరారు. షోరూం అధినేతలు పృథ్వి, మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల నుంచి లభిస్తున్న ఆదరణతో నగరంలో రెండో షోరూంను అందుబాటులోకి తెచ్చామన్నారు. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందుతున్న ద్విచక్ర వాహనాలను తక్కువ ధరలతో అందిస్తున్నామన్నారు. నూతన షోరూంను కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సాయికిరణ్ (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, మే 8(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో జరిగిన గాయపడిన సాయికిరణ్(27) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పాకాల మండలం పోలిరెడ్డిపల్లెకు చెందిన ఈ యువకుడు ద్విచక్ర వాహనంపై పాకాల నుంచి తిరుపతికి వస్తూ గాదంకి టోల్‌ప్లాజా వద్ద ఆర్టీసీ బస్సును ఢీ కొన్న సంగతి తెలిసిందే. తీవ్రంగా గాయపడిన సాయికిరణ్ తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసును నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వానతో ఉపశమనం

చంద్రగిరి, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు భారీ ఈదురు గాలులు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు మామిడి రైతులకు నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి.

ట్రాక్టర్ ట్రక్కు బోల్తా

తిరుపతి రూరల్, మే8(ఆంధ్రజ్యోతి): గాంధీపురం పంచాయతీ పరిధిలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయరహదారిపై గురువారం మధ్యాహ్నం ఇసుకలోడ్ ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడింది. ఆసమయంలో వెనుక నుంచి ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ట్రాక్టర్‌లో డ్రైవర్ ఒక్కరే ఉండడంతో సహాయకుల కోసం కొంతసేపు వాహనాన్ని అలాగే ఉంచేశారు. అటువైపు వచ్చే వాహనాదారులకు జాగ్రత్తగా టర్న్ తీసుకుని ముందుకెళ్లారు. వాహనచోదకులకు కొంత ఇబ్బందికరంగా మారింది.

సర్పంచ్‌కు పలువురి పరామర్శ

తిరుచానూరు, మే 8(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి తండ్రి ఏలుమలైరెడ్డి బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి, తుడా చైర్మన్ మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తదితరులు వచ్చి ఏలుమలైరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలువురు ప్రముఖులు కూడా పరామర్శించారు.

14నుంచి భద్రత కోర్సులపై ఉచిత శిక్షణ

చంద్రగిరి, మే 8(ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 14 నుంచి 13 రోజుల పాటు సీసీ కెమెరా ఇన్‌స్టాలింగ్, సెక్యూరిటీ అలారం, స్మోక్ డిటెక్టర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్వ ఉమ్మడి జిల్లా గ్రామీణ ప్రాంతంలో తెల్ల రేషన్ కార్డు కలిగి 19 నుండి 40 సంవత్సరాల మధ్య వయసున్న నిరుద్యోగ పురుషులు శిక్షణకు అర్హులు. కనీసం పదోతరగతి చదివి ఉండాలి. అభ్యర్థులు సంస్థ ఫోన్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవచ్చు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం వసతి కల్పించనున్నారు. శిక్షణ పూర్తయ్యాక సర్టిఫికెట్లు అందజేస్తారు. ఒక్కో బ్యాచ్‌కు 25 నుంచి 30 మంది మాత్రమే ఎంపిక చేయనున్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫోటోలతో సంస్థకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 7989680587, 9494951289, 6301717672 నంబర్లలో సంప్రదించాలని సురేష్‌బాబు సూచించారు.

బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

తిరుపతి(ఆటోనగర్), మే 8 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలో ఉన్న బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టెక్నికల్ డైరెక్టర్ కె.గురవయ్యను విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఎల్.చలపతి కోరారు. గురువారం సదరన్ డిస్కం కార్యాలయంలో ఆయన్ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు సీవీ వేణు, జగదీష్, కరీముల్లా ఖాన్, మధు, దిల్‌జార్ ఆయన వెంట ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి చెందలేదు

తిరుపతి(ఆటోనగర్), మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరమేనుగుంట వద్ద వలస కార్మికుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందలేదని విద్యుత్ టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు గురువారం ఒక ప్రకటనలో వివరించారు. ప్రమాదం జరిగిన స్థలంలో విద్యుత్ వైర్లు లేనప్పుడు షాక్ ఎలా కొడుతుందని ఆయన ప్రశ్నించారు.

ఎస్వీయూలో వీసీ ఆకస్మిక తనిఖీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 8 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిపాలనా భవనంలోని కొన్ని కీలక విభాగాల్లో వీసీ అప్పారావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎగ్జామ్స్, డెవలప్‌మెంట్, ఫైనాన్స్, ఈడీపీ సెల్‌లలో గురువారం సిబ్బంది హాజరు, పని విధానాన్ని పరిశీలించారు. వీసీ మాట్లాడుతూ ఉద్యోగులు నిజాయితీ, జవాబుదారీతనాన్ని పెంపొందించుకోవాలని కోరారు. తద్వారా యూనివర్సిటీ ప్రతిష్టను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

మూగజీవికి అండగా హెల్పింగ్ హార్ట్స్



దూడకు చికిత్స అందిస్తున్న వెటర్నరీ డాక్టర్లు

మంగళం, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడి తిరుపతి ఎస్వీ హైస్కూల్ మైదానం వద్ద పడి ఉన్న ఆవు దూడకు చికిత్సను అందించి మానవత్వాన్ని చాటుకున్నారు హెల్పింగ్‌హార్ట్స్ ప్రతినిధులు. కాలు విరిగి ఇబ్బంది పడుతున్న దూడను హెల్పింగ్‌హార్ట్స్ ప్రతినిధులు కల్లుపల్లి సురేందర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, అడ్రాయిట్ ప్రణీత్‌రెడ్డి, శేఖర్‌నాయర్, చంద్ర కలిసి ఎస్వీ వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సర్జన్ డాక్టర్ రఘునాథ్, డాక్టర్ భారతి దూడకు అల్యూమినియం రాడ్ అమర్చి పిండికట్టు వేసి చికిత్స అందించారు.

ధర్మం తప్పని ధీరులు పాండవులు

తిరుపతి అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): పాండవులు తమ ధర్మం పట్ల నిబద్ధతను చూపిస్తూ, ఇతరులకు సహాయం చేస్తూ, సత్యం, ధర్మాన్ని పాటించారని, మహాభారతం సమాజానికి మార్గదర్శిగా పనిచేస్తుందని, నైతిక విలువలను తెలియజేస్తుందని సరస్వతీ పుత్రుడు, పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ ఉద్ఘాటించారు. స్థానిక అన్నమాచార్య కళామందిరంలో హిందూ ధర్మప్రచార పరిషత్, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సౌజన్యంతో జరుగుతున్న విరాటపర్వ ప్రవచనం గురువారం ముగిసింది. మేడసానిని సన్మానించారు.

ఆరునెలల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స

తిరుపతి(వైద్యం),మే8(ఆంధ్రజ్యోతి):'అపెండిక్యులర్ అబ్సెసివ్' వ్యాధితో బాధపడుతున్న ఆరు నెలల చిన్నారి జరియానాకు ల్యాప్రోస్కోపిక్ అబ్సెసివ్ పద్ధతిలో అరుదైన శస్త్ర చికిత్స చేసినట్లు అంకురా ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వంశీ గురువారం తెలిపారు. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకుందని చెప్పారు.

కలసికట్టుగా పార్టీని బలోపేతం చేద్దాం

తిరుపతిరూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కలసికట్టుగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేసుకుందామని వైసీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. పాకాల మండలంలో ఇటీవల పార్టీ పదవులు పొందిన పలువురు నేతలు గురువారం తుమ్మలగుంటలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు తోడుగా నిలబడితే భవిష్యత్ బాగుంటుందన్నారు.

అమ్మవారి సేవలో న్యాయమూర్తులు



చెన్నై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ - ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణరావు

తిరుచానూరు, మే 8(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తులు గురువారం దర్శించుకున్నారు. ఉదయం రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణరావు, మధ్యాహ్నం చెన్నై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం సన్నిధిలోని మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఐ ల్యాండ్‌ల ఏర్పాటు



తిరుపతి(నేరవిభాగం), మే 8 (ఆంధ్రజ్యోతి): ఎండల నుంచి ట్రాఫిక్ పోలీసులకు రక్షణ కల్పించేలా నగరంలోని అన్ని కూడళ్లలో ట్రాఫిక్ ఐల్యాండ్‌లు ఏర్పాటు చేశారు. సెంట్రల్ పార్కు సర్కిల్, బాలాజీ కాలనీ, సుబ్బులక్ష్మి విగ్రహం, తిరుచానూరు రోడ్డు, ఎయిర్ బైపాస్ రోడ్డు, అన్నారావు సర్కిల్, మంగళం రోడ్డు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ పోలీసులు అక్కడి నుంచి విధులు నిర్వర్తించే చేసే దిశగా చర్యలు తీసుకున్నారు. ఐల్యాండ్‌లో కూర్చోవడానికి అనువుగా కుర్చీ, లైటు, తాగునీటి వసతి ఏర్పాటు చేశారు.

వెటర్నరీ ఉద్యోగులకు జీతాలు అందేనా?

రెండు నెలలుగా వేతనాల్లేక అవస్థలు

తిరుపతిరూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని పలువురు ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇంటి అద్దె, రుణ వాయిదాలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. రెగ్యులర్ అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి ఈనెల మొదటివారంలో రెండు నెలల జీతాలు కలిపి ఒకేసారి వారి ఖాతాకు జమ చేశారు. టైంస్కేల్, కాంట్రాక్ట్/పార్ట్‌టైమ్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్టైఫండ్ విద్యార్థులకు ఇప్పటికీ చెల్లించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. 2025-26 సంవత్సరానికి ప్రభుత్వం కొత్త బడ్జెట్ అలాట్ చేయడంతో ఏప్రిల్ 20 వరకు బడ్జెట్ రాలేదని, దీంతో జీతాలు చెల్లించడంలో కొంత ఆలస్యమవుతోందని వర్సిటీ ఉన్నతాధికార వర్గాలు అంటున్నారు. గతంలో అన్ని కేటగిరీ ఉద్యోగుల జీతాలు, విద్యార్థుల స్టైఫండ్ కలిపి ఒక హెడ్ అకౌంట్, కంటిన్జెన్సీ నిధులకు మరో హెడ్ అకౌంట్ కలిపి మొత్తం రెండు అకౌంట్లు మాత్రమే ఉండడంతో ఉద్యోగులందరికీ ఒకేసారి జీతాలు అందుతుండేవి. ప్రభుత్వం ఇప్పుడు సీఎఫ్ఎంఎస్‌లో కొన్ని మార్పులు చేపట్టడంతో ఐదు అకౌంట్‌లకు విడివిడిగా బిల్లులను అప్లోడ్ చేయాల్సి వస్తోంది. టైంస్కేల్, కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాల బిల్లులు రెండ్రోజుల క్రితం అప్లోడ్ చేశారని, మరో రెండ్రోజుల తర్వాత అవుట్‌సోర్సింగ్, స్టైఫండ్ బిల్లులను అప్‌లోడ్ చేస్తారని వర్సిటీ వర్గాలు అంటున్నాయి. మొత్తం మీద మరో వారం రోజుల లోపే అందరికీ జీతాలు అందుతాయని అంటున్నారు.

గంగ జాతరకు సీసీ కెమెరాల నిఘా

తిరుపతి(నేరవిభాగం) మే 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి గంగ జాతర సందర్భంగా పోలీసులు సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు. ఆలయం చుట్టూ, ప్రధాన ద్వారం, తూర్పు ముఖ ద్వారం, తుడా సర్కిల్, హెడ్ పోస్టాఫీసు రోడ్డు, ప్రశాంతి స్కూలు, మసీదు వీధి, మార్కెట్ రోడ్డు ప్రాంతాల్లో దాదాపు 26 సీసీ కెమెరాలు, ఆరు ఫింగర్ ప్రింట్ స్కానర్లు ఏర్పాటు చేశారు. అనుమానితుల వేలిముద్రలను సేకరించి.. వారి గతాన్ని పరిశీలిస్తారు. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం మూడుసార్లు ఆలయంలో పర్యవేక్షిస్తూ బందోబస్తు విధులపై సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. ఎవరైనా హిజ్రాలు ఆలయంలోకి వచ్చి భక్తులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. జాతర ప్రధాన రోజుల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెట్టనున్నారు. దీనికోసం ఆలయం వద్ద కమాండ్ కంట్రోలు రూమును ఏర్పాటు చేశారు.

రేషన్ వాహనాలను విద్యార్థుల కోసం వినియోగించండి

మంత్రి నారా లోకేష్‌కు టెంకాయల దామోదరం వినతి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 8 (ఆంధ్రజ్యోతి): మూలనపడిన రేషన్ సరుకుల వాహనాలను స్కూళ్లకు వెళ్లే విద్యార్థుల కోసం వినియోగించాలని మంత్రి నారా లోకేష్‌కు తిరుపతి భాషా, సాహిత్య సంఘాల వేదిక ప్రతినిధి టెంకాయల దామోదరం విన్నవించారు. ఈ మేరకు మంత్రి నారా లోకేష్‌ను గురువారం కలిసి ఆయన విన్నవించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అక్షరమాలతో కూడిన చార్టులు తెలుగు భాషలోనూ ఏర్పాటు చేయాలన్నారు. ఈ అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు దామోదరం, మన్నవ గంగాధరప్రసాద్ తెలిపారు.

ఘనంగా సత్యనారాయణస్వామి కల్యాణం





కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

తిరుపతి(జీవకోన), మే 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కొర్లగుంట మారుతీనగర్‌లోని సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, తలంబ్రాలు సమర్పించారు. పుల్లూరు అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 700మందికి అన్నదానం చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి సత్యనారాయణస్వామి ఊరేగింపు నిర్వహించారు. రాత్రి 10.30 గంటలకు ఏకాంత సేవ చేశారు. కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు రామిరెడ్డి, కామాటి వరదరాజులు, రవీంద్రబాబు, ట్రాక్టర్ గుణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహిళ శ్రీదుర్గ మృతిపై విచారణ



సూపరింటెండెంట్ రాధకు ఆధారాలను సమర్పిస్తున్న షణ్ముగం

తిరుపతి(వైద్యం), మే 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించిన చిత్తూరు తెలుగు మహిళా నాయకురాలు శ్రీదుర్గకు సంబంధించి రుయా వైద్యాధికారులు గురువారం విచారణ ప్రారంభించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆమెను అపోలో నిర్వహిస్తున్న ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యుల నిర్లక్ష్యంతో చనిపోయిందని మృతురాలి తండ్రి, బీసీ సంక్షేమ సంఘం నేత షణ్ముగం ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. ఆయన ఈ విషయంపై విచారణ చేపట్టాలని రుయా అధికారులను ఆదేశించారు. ఈక్రమంలో గురువారం రుయాస్పత్రిలో అధికారుల ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. విచాణకు షణ్ముగం హాజరై తన వద్ద ఉన్న ఆధారాలను సూపరింటెండెంట్ రాధకు సమర్పించారు. పూర్తి స్థాయిలో విచారించాక కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని రాధ తెలిపారు.





తిరుపతిలో జోరువాన



తిరుపతి అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం సాయంత్రం జోరువాన కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురగాలులతో బీభత్సం సృష్టించింది. రోడ్లపై నీరు జోరుగా ప్రవహించింది. గరుడవారధి నుంచి జలధారల ఉధృతం కనిపించింది. దాదాపు రెండు గంటల పాటు జనజీవనం స్తంభించింది. తాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని సందర్శించే భక్తులు తడుస్తూ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూలీలు, ఉద్యోగులు ఇళ్లకు చేరుకునే క్రమంలో అవస్థలు తప్పలేదు. వ్యాపారులకు అసౌకర్యం కలిగింది. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తలదాచుకునేందుకు పరుగులు తీస్తూ కనిపించారు. పగలంతా ఉష్ణతాపంతో ఇబ్బందిపడిన ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం లభించింది. చల్లటి గాలులతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది.

శ్రీకాళహస్తి

సత్యవేడు

ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ వై.లక్ష్మణరావుకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, మే 8(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో సతీష్‌మాలిక్, శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మహిళల జీవనోపాధే ప్రభుత్వ లక్ష్యం



ఫ్యాన్సీ షాప్‌ను ప్రారంభిస్తున్న మెప్మా అధికారులు

శ్రీకాళహస్తి, మే 8(ఆంధ్రజ్యోతి): మహిళల జీవనోపాధే ప్రభుత్వ లక్ష్యమని మెప్మా అధికారులు అన్నారు. పట్టణంలోని 32వ వార్డు పరిధిలో శ్రీబాలాజీ సమాఖ్య పరిధిలోని శ్రీలక్ష్మి సంఘం సభ్యురాలైన కవితకు రూ.1లక్ష సమాఖ్య రుణం మంజూరు చేశారు. దీంతో ఆమె ఫ్యాన్సీ అండ్ క్లాత్‌షాప్‌ను పెట్టుకున్నారు. దీనిని మెప్మా అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎంఎం జయరామ్, సీవో స్వాతి, ఆర్‌పీ శాంతి, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



శ్రీకాళహస్తి, మే 8(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం బోనుపల్లి గ్రామంలో గురువారం అంతర్జాతీయ రెడ్‌క్రాస్‌డేను పురస్కరించుకుని ఎంజీఎం, తిరుపతి జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 200మంది పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్, మాజీ సర్పంచ్ రామానాయుడు, తిరుపతి రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు సుబ్బారావు, డాక్టర్ సుధీర్, అజయ్‌కుమార్, కృష్ణకుమార్, ఎంజీఎం ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన పేరం ధనంజయులునాయుడు



ఏర్పేడు, మే 8 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి నారా లోకేశ్‌ను ఏర్పేడు మండల సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, మే 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేధో గురు దక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. వైభవంగా అభిషేకం జరిపించారు. విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు



రేణిగుంట, మే 8, (ఆంధ్రజ్యోతి) : రేణిగుంట మండలంలోని ప్రైవేటు పాఠశాలలను తిరుపతి డివిజన్ విద్యాశాఖ డిప్యూటీ ఈవో బాలాజీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు రావడంతో తనిఖీ నిర్వహి స్తున్నామని డిప్యూటీ ఈఓ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంఈవో-2 రంగనాథయ్య, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ పుష్పలత పాల్గొన్నారు.

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శికి స్వాగతం



రేణిగుంట, మే 8, (ఆంధ్రజ్యోతి) : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీకి ఘన స్వాగతం లభించింది. గురువారం ఉదయం ఢిల్లీ నుంచి ఇండిగో విమానంలో తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి, రాష్ట్ర కార్యదర్శి రమేష్, జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా కార్యవర్గ కార్యదర్శి కందారపు మురళి, నాయకులు సుబ్రమణ్యం, ప్రసాద్‌రావు, హరినాథ్, ఈశ్వరి స్వాగతం పలికారు.

ఆగమోక్తంగా సంకటహర అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భూమన కరుణాకరరెడ్డి

శ్రీకాళహస్తి, మే 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి దిగువసన్నిధివీధిలో శ్రీకాళహస్తి బ్రాహ్మణ సేవా సమాజం అధ్యక్షులు సింగరాజు ప్రకాశం శాస్త్రి, శ్రీహనుమాన్ సేవా సమితి అధ్యక్షులు దర్భా తులసీరామ్‌శర్మ మిత్ర బృందం నూతనంగా నిర్మించిన సంకటహర అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం గురువారం ఆగమోక్తంగా జరిగింది. హోమపూజలు నిర్వహించారు. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం బహదూరుపేటలోని కావమ్మ, మారయ్య ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభి షేకంలోనూ ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, మే 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రశేఖర్, రవికుమార్‌రెడ్డి, జ్యోతిరామ్, పేట చిరంజీవి, కావలి శివకుమార్, వెంకటరమణ యాదవ్, విశ్రాంత తహసీల్దారు చంద్రశేఖర్‌రావు, మణి, లక్ష్మణ్, చందుయాదవ్, మురళి, మునికుమార్, రాజా, సాయి, బాలాజీ, వెంటకయ్య, వీర మహిళలు శారద, రాజ్యలక్ష్మి, గాయత్రి, బత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కేవీబీపురం/ పిచ్చాటూరు, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హత ఉన్న వారు కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్లు మునిరత్నంరెడ్డి, టీవీ.సుబ్రమణ్యం కోరారు. గురువారం వారు మాట్లాడుతూ కార్డుల్లో మార్పులు, చేర్పులు, కొత్త కార్డుల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.







విశేషాలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి, ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు, ధ్వజపటాన్ని ఎగురువేస్తున్న దృశ్యం

ఆగమోక్తంగా చెన్నకేశవస్వామి ధ్వజారోహణం

శ్రీకాళహస్తి, మే 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో గురువారం ఆగమోక్తంగా ధ్వజారోహణం జరిగింది. శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారె అందజేశారు. ఆలయ ధ్వజస్తంభానికి గరుడ పతాకం ధరింప జేసి ఎగురవేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లు హంసవాహనంపై గ్రామవీధుల్లో ఊరేగారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఏఈవో హేమమాలిని, సూపరింటెండెంట్ రవి, అనుబంధ ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య పాల్గొన్నారు.

చెరువు కాలువ స్థలం ఆక్రమణ

- పొలానికి దారి లేకుండా చేశారు
- ఓ రైతు ఆవేదన

రేణిగుంట, మే 8, (ఆంధ్రజ్యోతి): చెరువు కాలువ బండిబాట స్థలాన్ని ఆక్రమిం చడంతో తన పొలానికి దారిలేక మూడేళ్లుగా వరి పంట వేయలేదని అత్తూరు గ్రామానికి చెందిన రైతు ఈశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ అత్తూరు గ్రామంలో సర్వే నెంబర్ 149/1లో 23 సెంట్ల చెరువు కాలువ పొరంబోకు స్థలం ఉందన్నారు. ఆ దారిలోనే తన పొలానికి రాకపోకలు సాగిచేవారమని గుర్తుచేశారు. వైసీపీ పాలనలో తన పొలానికి ముందు ఉన్న ఒక రైతు దారిని ఆక్రమించి పంట సాగుచేయడంతో తనకు దారిలేకపోయిందని విచారం వ్యక్తం చేశారు. అధి కారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకున్నాడు. ఈ విషయంపై తహసీల్దార్ సురేష్‌బాబుని వివరణ కోరగా స్వయంగా స్థలాన్ని సర్వే చేయించి రైతుకు న్యాయం చేస్తామని తెలిపారు.

వైభవంగా చిన్నకొట్టాయి ఉత్సవం



స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, మే 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయంలో చిన్నకొట్టాయి ఉత్సవం గురువారం ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయ ఆవరణంలోని పగడ చెట్టు వద్దకు తీసుకువచ్చారు. అక్కడ స్వామి అమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, గంధం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం రమణీయంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు పంపిణీ



మృతుడి కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

రేణిగుంట, మే 8, (ఆంధ్రజ్యోతి) : ప్రమాదంలో మృతిచెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రమాద బీమా చెక్కును అందజేశారు. గురువారం కరకంబాడి పంచాయతీలోని చెంగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన కార్యకర్త గురుస్వామి ఇటీవల ప్రమాదంలో మృతి చెందడంతో మృతుడి సతీమణి నందినికి రూ. 5 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి బుజ్జి నాయుడు, కట్టపుట్టాలమ్మ ఆలయ చైర్మన్ పాడి రాజేంద్ర, నాయకులు ధనంజయులు, కేవీ.చలం, హరికృష్ణ, మోహన్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

ఏర్పేడు, మే 8(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం వికృతమాల గ్రామానికి చెందిన సుజాత(34) కుటుంబ కలహాలతో గురువారం ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లోనే ఉరి వేసుకుని చనిపోయింది. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదు.

లాభసాటి వ్యవసాయంపై చైతన్య సదస్సు



చెక్కులు అందజేస్తున్న శాస్త్రవేత్త దివ్యసుధ

ఏర్పేడు, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేట రాస్ సేవా నిలయంలో రాష్ట్రీయ సేవా సమితి మహిళా భారతి ద్వారా రైతులకు లాభసాటి వ్యవ సాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బి దివ్య సుధ మాట్లాడుతూ పూర్వ కాలంలో కొర్రలు, జొన్నలు, రాగులు, అరిసెలు, సాములు ఎక్కువగా తినే వారన్నారు. అందుకే వారు ఆరోగ్యంగా ఉండే వారని తెలిపారు. ఇప్పటి ఆహారంలో అన్నం ఎక్కువగా చిరుధాన్యాలు తక్కువగా తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. మహిళలకు వ్యవసాయ విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా వ్యాపారవేత్తలుగా తయారు చేయడానికి శిక్షణను ఉచితంగా అందజేస్తామన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 117మంది రైతులకు రూ.62.35లక్షల రుణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి బాలాజీరెడ్డి, పశువైద్యశాస్త్రవేత్త డాక్టర్ అనూష, వెంకట్‌కుమార్, మునిపార్థసారథి, జయప్రకాష్, గౌతమి, కిరణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం

శ్రీకాళహస్తి, మే 8(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో వివిధ ఎలక్ట్రానిక్ పరిశ్రమల స్థాపన కోసం విచ్చేసిన మంత్రి నారా లోకేశ్‌కు గురువారం ఘన స్వాగతం లభించింది. శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్ పరిశ్రమకు భూమిపూజ చేసిన అనంతరం రేణిగుంట విమానాశ్రయానికి తిరుగు పయనమైన ఆయన మంత్రికి ఊరందూరు వద్ద ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి ఘనస్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. అనంతరం వీడ్కోలు పలికారు.

మీసేవ యూనియన్ కృతజ్ఞతలు

శ్రీకాళహస్తి, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మీసేవ కార్యాలయాలను పునరుద్ధరించడంపై తిరుపతి విమానాశ్రయంలో మీసేవ అసోసియేషన్ నాయకులు మంత్రి లోకేశ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సూర్యకుమార్, సభ్యులు కిరణ్, శ్రావణ్, తేజ, గుణ, గురవయ్య, ఉదయ్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల అభివృద్ధికి సహకరించండి



మంత్రి లోకేశ్‌ను కలిసిన సురేష్‌రెడ్డి

కేవీబీపురం, మే 8(ఆంధ్రజ్యోతి): కేవీబీ పురంలోని ఆదర్శ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం అందించాలని ఎస్‌ఎంసీ కమిటీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, మండల నాయకులు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. గురువారం సత్యవేడులో మంత్రిని కలిశారు. పాఠశాల ఆవరణం, భవనాల నిర్మాణాలను ఫొటోలను లోకేశ్‌కు చూపించారు. స్పందించిన మంత్రి త్వరలోనే పాఠశాల అభివృద్ధికి చేయూతనందిస్తానని తెలిపారు.

ఏపీవో సస్పెన్షన్‌పై దర్యాప్తు



దర్యాప్తు చేస్తున్న ఏపీడీ కవిత

కేవీబీపురం, మే 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడారన్న అభియోగంతో ఏపీవో కుమారస్వామిపై అధికారుల సస్పెన్షన్ వేటు వేయటం విదితమే. దానిపై నిజ నిర్ధారణ చేయడానికి ఏపీడీ కవిత దర్యాప్తు చేపట్టారు. ఫిర్యాదు చేసిన పవనివారికండ్రిగకు చెందిన హరి, శ్రీనివాసపురం గ్రామానికి చెందిన జానీలను పిలిపించి విచారణ చేపట్టారు. అయితే ఏవిధమైన అవకతవకలకు పాల్పడలేదని రాతపూర్వకంగా స్టేట్‌మెంట్ ఇచ్చారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏపీడీ తెలియజేశారు.

పుత్తూరు వార్తలు

టిడ్కో ఇళ్ల నిర్మాణంలో పురోగతి



వినాయకపురం వద్ద నిర్మించిన టిడ్కోఇళ్లు

పుత్తూరు అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల కల సాకారం కానుంది. నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో కేంద్ర సహకారంతో గత టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వేగవంతంగా నిర్మాణాలు పూర్తి కాగా లబ్ధిదారులకు అందించే క్రమంలో ఎన్నికలు వచ్చేశాయి. ఆ తరువాత వైసీపీ పాలన రావడంతో నిరుపేదలకు అందాల్సిన టిడ్కో ఇళ్లు నిర్లక్ష్యానికి గురయ్యాయి. నేడు కూటమి ప్రభుత్వం రావడంతో లబ్ధిదారులకు ఇళ్లు అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇళ్ల నిర్మాణాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేస్తున్నారు. కాలువలు, తాగునీరు తదితర పనులు శరవేగంగా చేపడుతున్నారు. పుత్తూరు వినాయకపురం వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లు మరో రెండు నెలల్లో లబ్ధిదారులకు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 432 ఇళ్ల నిర్మాణం జరిగింది. ఇప్పటికే 163 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్‌లు చేయించి ఇచ్చారు. ప్రస్తుతం 23 మంది నుంచి టిడ్కో టెక్నికల్ ఆఫీసర్ వివరాలు, అర్హత పత్రాలను స్వీకరించారు. వీరికి కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి అందిస్తారు. మిగిలిన వారి నుంచి వివరాలు సేకరించి రిజిస్ట్రేషన్ ప్రక్రియకు చర్యలు చేపట్టారు.

కమనీయం అగస్త్యేశ్వరుని కల్యాణం



నారాయణవనం, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయంలో గ్రామంలో ఉన్న మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి స్వామివారి ఆర్జిత కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి స్వామివారు అశ్వవాహనంపై గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం స్వామివారికి నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం విశేష పూజల అనంతరం మేళతాళలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ మరగదవల్లీ సమేత స్వామివారిని సుందరంగా అలంకరించి కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. అర్చకులు వేద మంత్రాల మధ్య కమనీయంగా సాగిన కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలు అంద జేశారు. రాత్రి స్వామివారు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, ఏఈవో రవి, ఆర్జితం అధికారి భరత్ పాల్గొన్నారు.

50 శాతం రాయితీతో పశువుల దాణా పంపిణీ

రేణిగుంట, మే 8, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గాజులమండ్యం రైతు కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ పాడి రైతులకు 50 శాతం రాయితీతో పశువుల దాణా గురువారం పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, వెటర్నరీ ఏడీ సునీత, వెటర్నరీ డాక్టర్ రెడ్డెప్పరెడ్డి, టీడీపీ బూత్ కన్వీనర్ మోహన్‌రావు, నాగరాజు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జిలో చిక్కుకున్న మినీ ట్రక్కు



పుత్తూరు అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ఎంబీ రోడ్డులోని రైల్వే అండర్ బ్రిడ్జిలో ఎస్ఎంఎస్ లాజిస్టిక్స్‌కు చెందిన మినీ ట్రక్కు చిక్కుకుంది. గురువారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఈ ఘటన జరిగింది. మినీట్రక్కును బయటకు తీసేందుకు గంటకు పైగా శ్రమించారు. ఫలితంగా గంటకు పైగా ట్రాఫిక్ సమస్య నెలకొంది. గేట్ పుత్తూరు, జాతీయ రహదారి వైపు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ అండర్ బ్రిడ్జిలో భారీ వాహనాలు ప్రవేశించకుండా రైలింగ్ ఏర్పాటు చేయాల్సి ఉందని వాహనదారులు కోరుతున్నారు.

అశ్వవాహనంపై సదాశివుడి విహారం

పుత్తూరు టౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): పుత్తూరులో కొలువైన కామాక్షి దేవి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే రాత్రి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం స్వామివారికి నిత్యపూజా కైంకర్యాలు జరిపించారు. సాయంత్రం ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారి కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ దంపతులు



అశ్వవాహనంపై ఊరేగుతున్న సదాశివేశ్వరుడు